తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన వైసీపీకి చెందిన రాజభవనం వెలసింది. ఏడాదిన్నర కిందట అధికారాన్ని అడ్డుపెట్టుకుని అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని నామమాత్రపు లీజు ధరపై దక్కించుకున్న వైసీపీ పెద్దలు అందులో ఎలాంటి అనుమతులూ లేకుండా జిల్లా పార్టీ కార్యాలయం పేరిట భారీ భవంతిని నిర్మించారు. ఒకవైపు విమానాశ్రయం, మరోవైపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల నడుమ విలువైన భూమిని ఓ రాజకీయ పార్టీకి కేటాయించడమే ఆశ్చర్యకరమైతే దానికి స్థానిక పంచాయతీ నుంచి గానీ, తుడ నుంచి గానీ అనుమతులు లేకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. టీడీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాలకు చేసిన భూ కేటాయింపులు, భవనాల నిర్మాణంపై కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనం

విమానాశ్రయ సమీపాన శ్వేత రాజభవనం

నామమాత్రపు లీజు ధరతో ఖరీదైన భూమి కేటాయించిన గత ప్రభుత్వం

పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూమి రాజకీయ పార్టీకి

పంచాయతీ, తుడ అనుమతులు లేకుండానే నిర్మాణం

ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఖరీదైన భూమి కేటాయింపు

రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ కుర్రకాల్వ రెవెన్యూ గ్రామం 219-15, 219-16 సర్వే నెంబర్లలోని రెండెకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్లపాటు వైసీపీ కార్యాలయం కోసం లీజుకు కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న అప్పటి ప్రభుత్వం జీవో (నెంబరు 757) జారీ చేసింది. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ భూమి విమానాశ్రయానికి చేరువగా ఆ మార్గంలోనే వుంది. గత టీడీపీ ప్రభుత్వం సరిగ్గా ఇక్కడే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా శ్రీవెంకటేశ్వర ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్లస్టర్ పరిధిలో ఇప్పటికే కార్బన్ మొబైల్స్, సెల్‌కాన్ మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలున్నాయి. ఇక్కడి ప్రభుత్వ భూములను ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు లేదా ప్రతిష్టాత్మక విద్యాసంస్థలకు కేటాయించేందుకు ఉద్దేశించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం విలువ రూ.5కోట్లకుపైగా పలుకుతోంది. ఇలాంటి చోట ఓ రాజకీయ పార్టీకి రూ.10 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని ఎకరాకు ఏడాదికి కేవలం రూ.వెయ్యి నామమాత్రపు చెల్లింపుతో లీజుపై కేటాయించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

పంచాయతీ ఇచ్చింది నిరభ్యంతర పత్రమే!

వైసీపీ కార్యాలయం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని జీపాలెం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. భూమి కేటాయింపు ప్రక్రియలో భాగంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ పాలకవర్గంతో ఆ మేరకు తీర్మానం చేయించారు.

అనుమతులు లేకుండానే నిర్మాణం

వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక జీపాలెం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. నిర్మాణం ప్రారంభించిన సమయంలో పంచాయతీ సిబ్బంది వెళ్లి వాకబు చేయగా కలెక్టర్ అనుమతి, తుడ అనుమతులు వున్నాయని పనులు చేపట్టిన వ్యక్తులు చెప్పినట్టు సమాచారం. అసలే అధికార పార్టీ కార్యాలయం వ్యవహారం కావడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకుండిపోయారని తెలిసింది. కాగా తుడాలో ఆరా తీయగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేయలేదని, తుడా అనుమతులు ఇవ్వలేదని వెల్లడైంది. భవన నిర్మాణం చేపట్టిన స్థలం పారిశ్రామిక వాడ పరిధిలో వున్నందున ఏపీఐఐసీ అధికారుల నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారేమోనని ఆరా తీయగా అలాంటిదేమీ లేదని తెలిసింది.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువగా రూ. 10 కోట్లు విలువైన భూమిని నామమాత్రపు లీజుపై కేటాయించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. మరోవైపు స్థానిక పంచాయతీ, తుడ నుంచీ అనుమతులు లేకపోవడంతో ఆ రెండు స్థానిక సంస్థలు కూడా భారీగానే ఆదాయం కోల్పోయాయి. ప్లాన్ అప్రూవల్ సందర్భంగా ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అంతస్తులతో భవనం నిర్మిస్తున్నారనే దాన్ని బట్టి పంచాయతీకి అప్రూవల్, డెవలప్‌మెంటల్ చార్జీలు చెల్లించాల్సి వుంటుంది. అవన్నీ పంచాయతీ కోల్పోయినట్టయింది.

కూలుస్తారా? క్రమబద్ధీకరిస్తారా?

భూమి ఏదైనా, భవనం ఎలాంటిదైనా పంచాయతీ పరిధిలో నిర్మాణం చేపడితే తప్పనిసరిగా పంచాయతీ నుంచి అనుమతులు పొందాలి. ఎందుకంటే ఆ భవనానికి పంచాయతీయే డోర్ నెంబరు, అసెస్‌మెంట్ నెంబరు కేటాయించాల్సి వుంటుంది. ఆస్తి పన్ను వంటివి నిర్ణయించేది కూడా పంచాయతీయే. మరోవైపు తుడ నుంచి గానీ, ఏపీఐఐసీ నుంచి గానీ అనుమతులు లేవు. ఇవేవీ జరగనపుడు ఆ భవనాన్ని అక్రమ కట్టడంగా పరిగణించాల్సి వుంటుంది. ఈ లెక్కన వైసీపీ కార్యాలయ భవనాన్నీ అక్రమ కట్టడంగానే భావించాలి. ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతల ఇళ్లను సైతం నిబంధనల ఉల్లంఘన నెపంతో కూల్చివేయించిన వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయానికి మాత్రం ఎలాంటి అనుమతులూ పొందకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి వైఖరి తీసుకుంటుందనేది ఆసక్తి కలిగిస్తోంది. అనుమతులు లేకపోవడంపై నోటీసులు జారీ చేసి.. క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటుందా? లేకపోతే అక్రమ కట్టడం కింద పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చివేస్తుందా? అన్నది వేచి చూడాల్సి వుంది.



అంతలోనే ఎంత మార్పు

రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా తిరుపతి కార్పొరేషన్ అధికారులు

గత, వర్తమాన పాలనను పోల్చుకుంటున్న యంత్రాంగం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వంలో చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై తనిఖీలు చేయాలన్నా తిరుపతి నగరపాలక సంస్థ అధికారులు వణికిపోయేవారు. ఫిర్యాదులపై అటువైపు వెళ్లగానే స్థానిక కార్పొరేటర్ నుంచో, వైసీపీ నాయకుల నుంచో తీవ్రమైన ఒత్తిళ్లు వచ్చేవి. దీంతో అధికారులు నామమాత్రంగా తనిఖీలు ముగించుకుని తిరుగుముఖం పట్టేవారు. ఇప్పుడు అలా కాదు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే తిరుపతిలో పేరుమోసిన ప్రముఖ హోటల్‌ను అధికారులు సీజ్ చేయగలిగారు. తిరుమల బైపాస్ రోడ్డులోని పీఎస్4 హోటల్లో భోజనం ప్లేటులో జెర్రి కనిపించడంతో వినియోగదారుడి ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులు, జిల్లా ఆహార భద్రతాధికారులు హుటాహుటిన చేరుకుని హోటల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో హోటల్‌ను సీజ్ చేశారు. వాస్తవానికి ఇదే పేరుగల మరో బ్రాంచ్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చెందిన స్థలంలో (శిల్పారామం ఎదురుగా) ఉంది. హోటల్ యాజమాన్యం అటువైపు నుంచి ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అయితే ఘటన పూర్వాపరాల గురించి మాత్రమే అధికారులను పార్టీ నేతలు ఆరా తీసినట్టు సమాచారం. అంతేగానీ హోటల్ తెరవండని ఒత్తిడి చేయలేదని అధికారులు చెప్పుకుంటున్నారు. అదే వైసీపీ ప్రభుత్వంలో ఇంత పెద్ద హోటల్‌ను సీజ్ చేస్తే గల్లీ స్థాయి నాయకుడు కూడా దబాయింపులకు దిగేవారని గత అనుభవాలను గుర్తుచేసుకుంటున్నారు.

గతంలో చేతులు కట్టేసి..

గత ప్రభుత్వంలో కార్పొరేషన్ ఆరోగ్య విభాగానికి వైసీపీ శ్రేణులు చేతులు కట్టేశాయి. అధికారుల విధులకు అడుగడుగునా అడ్డుతగిలేవారన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులైతే వారితో చేతులు కలిపి, చెప్పిందంతా చేసినవారూ ఉన్నారు. మరికొందరు ఒత్తిళ్లకు తట్టుకోలేక బదిలీపై వెళితే, ఇంకొందరు అసంతృప్తితో పనిచేసుకుంటూ వచ్చారు. ఏడాది క్రితం లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని బార్‌బిక్యూ హోటల్‌తోపాటు మరో బిరియాని సెంటర్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోబోతే వైసీపీ నేతలు పంచాయితీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక 17వ డివిజన్లోని గోపాల్‌రాజు కాలనీలోని జనావాసాల మధ్య గొర్రెల దొడ్డిని తొలగించాలని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్, వెటర్నరీ ఆఫీసర్లు పరిశీలించి.. ఖాళీచేయాలని ఆదేశిస్తే వైసీపీ నేతలు అధికారులపై మండిపడ్డట్టు సమాచారం. వాటిని ఖాళీ చేయించకుండా అడ్డుకున్నట్టు తెలిసింది. అంతెందుకు ఓ చికెన్ షాపు వేస్ట్ కాలువలో వేస్తున్నారని తెలుసుకుని అధికారులు వెళితే.. ఓ కోఆప్షన్ మెంబర్ ఫోనులోనే అధికారులను బెదిరించి అక్కడినుంచి పంపించేసినట్టు తెలిసింది. ఇలా కథలు కథలుగా గత ప్రభుత్వంలో జరిగిన వైసీపీ నేతల దబాయింపులు గురించి చెప్పుకుంటున్నారు.

ఆ ఉద్యోగులపై చర్యలెందుకు తీసుకోలేదు?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● ఆరా తీసిన ఇన్‌చార్జ్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 23: 'ఎన్నికల విధులకు గైర్హాజరైన అధికారులకు నోటీసులిచ్చినా సుమారు 30మందికిపైగా వివరణ ఇవ్వలేదా? ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందే లెక్క. పోలింగ్ పూర్తయి ఇన్ని రోజులైనా ఆ ఉద్యోగులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని కలెక్టరేట్ అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర ఆరా తీసినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ధీమాతో కొందరు వివరణ ఇవ్వలేదని 'ఆ ఉద్యోగులపై కొరడా' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ధ్యానచంద్ర.. వివరణ ఇవ్వని ఉద్యోగులకు సంబంధించిన ఫైల్ సోమవారం ఉదయంకల్లా తనవద్దకు రావాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అలాగే ఎన్నికల రెండో దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన ఏడుగురు ఉద్యోగుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

తిరుపతిలోని రుయా ఆస్పత్రి సీఎస్ ఆర్‌ఎంవో లక్ష్మా నాయక్ ఆగడాలతో విసిగిపోయిన యంత్రాంగం ఆధారాలతోసహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ (డీహెచ్)కు సరెండర్ చేస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వారం కిందట ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అవేమీ పట్టించుకోకుండా తన చాంబర్‌లో వచ్చి కూర్చొని డ్యూటీ చేయడం మొదలుపెట్టడంతో ఆగ్రహించిన సూపరింటెండెంట్ మూడ్రోజుల కిందట ఆయన గదికి తాళాలు వేసేశారు. ఇదిలా ఉంటే మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారినుంచి సీఎస్ ఆర్‌ఎంవో వసూళ్లకు పాల్పడిన వీడియోలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి.

రుయాలో వసూల్ నాయక్

● ఏపనికైనా చేయి తడపాల్సిందే ● సీఎస్ ఆర్‌ఎంవో స్థాయి అధికారిపై సర్వత్రా విమర్శలు ● డీహెచ్‌కు సరెండర్ చేసిన డీఎంఈ

రుయాస్పత్రిలో సీఎస్ ఆర్‌ఎంవోగా గత ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన లక్ష్మానాయక్ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి జోరుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు, ఫిర్యాదులున్నాయి. దీనికితోడు ఉద్యోగులతో దురుసుగా వ్యవహరించడం, మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేయడంతోపాటు రాత్రిళ్లు తనిఖీల పేరుతో మద్యం తాగి విధుల్లోని వైద్యులు, సిబ్బందిని దుర్భాషలాడతారట. ఈ విషయంపై ఇప్పటికే పీజీలు, హౌస్ సర్జన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి ఉన్నారు.

సరెండర్ చేసింది వాస్తవమే

సీఎస్ ఆర్‌ఎంవో లక్ష్మానాయక్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తుండటం, ఏజెన్సీ నిర్వాహకులను వేధించడం, మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారిని ఇబ్బంది పెట్టడం వంటి పలు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.ఆయన్ను సరెండర్ చేయాలని ఆదేశించారు.దాంతో సరెండర్ చేయడంతోపాటు రిలీవ్ చేసింది వాస్తవమే. కానీ ఆయన తన గదిలోనుంచి వెళ్లకుండా కూర్చొని ఉన్నారు. ఇదేమని అడిగితే దురుసుగా ప్రవరిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు గదికి తాళం వేశాం.

- రవిప్రభు, సూపరింటెండెంట్, రుయాస్పత్రి

వసూళ్లు ఇలా..

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలకు చెందిన ఉద్యోగులకు మెడికల్ లీవ్ కావాలంటే ఆర్‌ఎంవో, సీఎస్ ఆర్‌ఎంవో స్థాయి అధికారులు సంబంధిత ధ్రువీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. ఈ మెడికల్ సర్టిఫికెట్ల కోసం రోజుకు దాదాపు 20 మందికిపైగా రుయాస్పత్రికి వస్తుంటారు. దీన్నే సీఎస్‌ఆర్‌ఎంవో స్థాయి అధికారి.. ఆదాయ వనరుగా మార్చుకున్నారట. బాధితుల అవసరాన్ని బట్టి మెడికల్ సర్టిఫికెట్ మంజూరుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తారట. దీంతోపాటు ఆస్పత్రిలోని సిబ్బందికి కోరుకున్న చోట డ్యూటీ కావాలన్నా ఆయన అడిగినంత ఇవ్వాలట. వీటితోపాటు పారిశుధ్య, సెక్యూరిటీ, రోగులకు ఆహారం సరఫరా చేసే ఏజెన్సీల పనితీరును పరిశీలించి ప్రతి నెలా తగిన మార్కులు వేసి.. బిల్లులు మంజూరు చేయడానికీ రూ.లక్షలు వసూలు చేస్తారట.

ప్రైవేటు వ్యక్తులతో వసూళ్ల పర్వం

మెడికల్ సర్టిఫికెట్లు, సిబ్బందిని భయపెట్టేందుకు ఇచ్చే మెమోలను తయారు చేసేందుకు, నగదు వసూళ్ల కోసం ఏకంగా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను తన చాంబర్‌లో నియమించుకున్నారట. దీంతో వీరిద్దరే అన్ని పనులు చూసుకోవడంతోపాటు సిబ్బందికి దిశానిర్దేశం కూడా చేస్తుండటంతో ఉన్నతాధికారులు సీఎస్ ఆర్‌ఎంవోను మందలించినా ఫలితం లేకపోయిందట.

- తిరుపతి(వైద్యం)



మెడికల్ సర్టిఫికెట్ మంజూరు చేసినందుకు బాధితుడి నుంచి నగదు తీసుకుంటున్న సీఎస్ ఆర్‌ఎంవో లక్ష్మానాయక్ (ఫైల్‌ఫొటో)

మళ్లీ మొదలైన తమిళ జాలర్ల ఆట



కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రం ఒడ్డుకొచ్చిన తమిళబోట్లు

కోట, జూన్ 23: సముద్రంలో చేపలను వేటాడేందుకు వెళ్లిన జిల్లాలోని మత్స్యకారులకు చేదు అనుభవం ఎదురవుతోంది. చేపల కోసం వలలు విసిరి, పట్టుకోబోయే సమయంలో హైస్పీడ్ మోటరు బోట్లతో తమిళ జాలర్లు ఆంధ్రా జలాల్లోకి చొరబడుతున్నారు. వలలను ధ్వంసం చేయడమేకాక, మత్స్య సంపదనూ తన్నుకెళుతున్నారు. అడ్డుకున్న వారిపై దాడులకూ తెగబడుతున్నారు. వల ఒక్కోటి రూ.50వేల నుంచి రూ.75వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒట్టి చేతులతో ఇంటికి..

కోట, వాకాడు మండలాల్లో సుమారు 14 మత్స్యకార గ్రామాలున్నాయి. వీటిల్లో 29వేలకుపైగా మత్స్యకారులు చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 61 రోజుల వేట విరామం తర్వాత కోట మండలం గోవిందపల్లిపాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. అక్కడ చేపలవేట అటుంచితే తమిళ జాలర్లు సృష్టించే బీభత్సాన్ని తట్టుకుని.. పోరాడలేక ఒట్టి చేతులతో ఇంటికి వస్తున్నారు.

ఆకలి కేకలు

రెండు నెలల చేపల వేట విరామంతో మత్స్యకారులు ఆర్థికంగా కొంత ఇబ్బందులు పడ్డారు. తీరా ఇపుడు తమిళ జాలర్ల రూపంలో వేట కొనసాగక పోవడంతో మత్స్యకార గ్రామాలు మళ్లీ ఆకలి కేకలు పెడుతున్నాయి. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని గంగపుత్రులు కోరుతున్నారు.

హైస్పీడ్ మోటర్ బోట్లతో.. : తమిళనాడులోని నాగూరు, నాగపట్టినం, తూత్తుకుడి తదితర ప్రాంతాల నుంచి తమిళ జాలర్లు హైస్పీడ్ మోటర్లు కలిగిన బోట్లతో సముద్రంలోకి వేటకు వస్తున్నారు. వారు తమిళనాడు సరిహద్దులు దాటి ఆంధ్రా జలాల్లోకి చొరబడుతున్నారు. గతంలో సముద్రం తీరం నుంచి 80-120 కిలోమీటర్ల వరకు మాత్రమే వచ్చి చేపలను పట్టుకుని వెళ్లేవారు. ప్రస్తుతం సముద్రతీరం వరకువచ్చేస్తున్నారు.

ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు



తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఇన్‌చార్జి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ.. వైసీపీ వీర విధేయుడిగా పేరుపొందిన రిషాంత్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆయన ప్రస్తుతం సెలవులో ఉన్నారు. దీంతో హర్షవర్ధన్ రాజు సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్), జూన్ 23: కలెక్టరేట్‌లో మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యం

● ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ఎక్కువమందికి దర్శనం కల్పించేలా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని మాజీ హోంమంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో తిరుమల ఆలయం ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. శాసనసభ్యుడిగా మూడోసారి గెలుపొందిన నేపథ్యంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని మెరుగుపరచడంతో పాటు అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేలా సీఎం యోచిస్తున్నారన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

● ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు

తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రాష్ట్రం కోల్పోయిన ప్రతిష్టను నిలబెట్టడం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు అభిప్రాయపడ్డారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. అమరావతి, పోలవరం పూర్తికావడంతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం బాగా జరగాలని ఐదేళ్ల కోట్ల మంది ప్రజల ఆకాంక్ష అన్నారు. ప్రజాపాలన మొదలైందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 93 శాతం సీట్లను కూటమి గెలిచిందన్నారు. జగన్ పరిపాలనపై ప్రజలు విసిగిపోవడమే ఇందుకు కారణమన్నారు. ఏపార్టీ అధికారంలో ఉన్నా ప్రజల ఆకాంక్షను నెరవేర్చకపోతే ఇలాంటి తీర్పే వస్తుందన్నారు.

మొదటిఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన టెంపో

● ఆరుగురు భక్తులకు స్వల్పగాయాలు



తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో ఆదివారం ఓ వాహనం అదుపుతప్పి క్రాష్‌బ్యారియర్‌ను ఢీ కొంది. 9 మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు శ్రీవారి దర్శనం ముగించుకుని ఆదివారం సాయంత్రం టెంపో ట్రావెలర్ వాహనంలో తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. 35వ మలుపు వద్ద వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొంది. వాహనంలోని తొమ్మిది మంది భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. బ్రేక్ ఫైయిల్ కావడంతోనే ప్రమాదం జరిగిందని డ్రైవర్ చెబుతున్నాడు.

తిరుమల స్థానికులను ఆదుకుంటాం

తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని బాలాజీనగర్‌లో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు మదన్ ఆదివారం పర్యటించారు. తొలుత జనసేన నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. అనంతరం బాలాజీనగర్‌లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిపై రేకుల స్థానంలో స్లాబ్ వేయాలని, తాగునీరు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరారు. దీనిపై మదన్ స్పందిస్తూ త్వరలో సమస్యలన్నీ పరిస్కరిస్తామని, స్థానికులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు. జనసేన నాయకులు మురళి, రమణ, విగ్నేష్, శివ, సుధాకర్, మంజు, దినేష్, తనూజ్, కుమార్, పాండు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి తిరుమల స్థానికుల సత్కారం



తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): తిరుమల వచ్చిన రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను తిరుమల టీడీపీ నేతలు ఆదివారం సత్కరించారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన అనితకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో పుష్పగుచ్చాలు, శ్రీవారి చిత్రపటాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. అనితను కలిసిన వారితో కేశవులు, రాజుయాదవ్, వెంకటస్వామి, గోపాలకృష్ణ, మల్లికార్జున తదితరులు ఉన్నారు.

నృత్యం ముగ్ధ మనోహరం



తిరుచానూరు, జూన్ 23: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి చెన్నైకు చెందిన శంకరా నాట్య విద్యాలయ డ్యాన్స్ బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ముగ్ధ మనోహరంగా సాగింది. గణపతి కీర్తనలు, త్యాగరాజకీర్తనలు, పెరుమాళ్ కీర్తనలు, తరంగం అంశం, శివన్ స్మరణ, ఆండాల్ అమ్మ పేరియన్ తదితర అంశాలను మీనాక్షి బృందం(చెన్నై), సరస్వతి బృందం, మైథిలి ముఖేష్ బృందం(కోయంబత్తూరు), సౌమ్య సత్యరాజ్ బృందం(విల్లుపురం) చక్కగా నర్తించి అలరించారు. కళాకారులను శిల్పారామం ఏవో ఖాదరవల్లి ఘనంగా సన్మానించారు. .

పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ కొత్త కార్యవర్గం



తులసీరామన్ - అనిల్ కుమార్

పాకాల, జూన్ 23: స్థానిక పాటినం లయన్స్ క్లబ్ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేఎన్ తులసీరామన్, ఉపాధ్యక్షుడిగా మారసాని నాగేంద్ర, కార్యదర్శిగా పోతుగుంట అనిల్ కుమార్, కోశాధికారిగా మారసాని మహేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగ తులసీరామన్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు అందించడానికి కృషి చేస్తామన్నారు. మారసాని విజయబాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ఆసుపత్రి పాలే..

● ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్ కోత



పాకాల, జూన్ 23: పాకాల-నేంద్రగుంట రహదారిలో రైల్వే గేటు సమీపం నుంచి సీఎస్ఐ చర్చి మలుపు వరకూ రోడ్డు మార్జిన్ ఇరువైపుల కోతకు గురైంది. ఓ వైపు ఇన్‌ఫెనిట్ జీసస్ స్కూల్, రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్, మరోవైపు సెయింట్ పాల్స్ చర్చ్ ఉన్నాయి. సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఉన్నాయి. పరిసర గ్రామాలకు వెళ్లాలంటే ఈ మార్గమే ఆధారం. ఈ రోడ్డులో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో గాంధీనగర్, బాలాజీ కాలనీ, శ్రీనివాసనగర్, గుట్టకింద ఇండ్లు, కరీంతుల్లాబాద్‌కు వెళ్లాలంటే ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్‌లో మార్జిన్ కోత కనిపించక కింద పడిపోతున్నారు. వందలాది మంది స్కూలు పిల్లలు వెళ్లే ఈ రహదారిలో కోతకు గురైన రోడ్డు మార్జిన్ మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించండి



చుక్కా ధనుంజయ యాదవ్

విజయపురం, జూన్ 23: గ్రామ పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయపురంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.8,629కోట్లను కేటాయిస్తే గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. దీనిపై పలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటా

● ఎమ్మెల్యే పులివర్తి నాని ● ఘన స్వాగతం పలికిన కూటమి శ్రేణులు



తనపల్లి జంక్షన్ వద్ద పులివర్తి నానికి గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 23: ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని శాసన సభలో ప్రమాణస్వీకారం చేసి మొదటిసారి ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. భారీ వర్షంలోనూ రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుచానూరు వరకు నానికి కూటమి శ్రేణులు భారీఎత్తున ఘనస్వాగతం పలికారు. టీడీపీ శ్రేణులు ఆయన కోసం వేచి చూశారు. అడుగడుగునా మంగళహారతులతో స్వాగతం పలికారు. భారీ పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మీరు నాపై చూపిన ఆదరణ, అభిమానానికి కృతజ్ఞుడినని తెలిపారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతో చంద్రగిరిని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, మధు, కిషోర్ రెడ్డి, సురేంద్ర నాయుడు, కత్తి సుధ, శ్రీనివాసులు, సాయి రాయల్, సాల్మన్‌రాజు, మునిరత్నంరెడ్డి, సునీల్, హరేరామ్, రాజేంద్ర, కళావతి, వాణిగౌడ్, వెంకటేష్‌తో పాటు నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోండి

● హోంమంత్రికి రామచంద్రానాయుడు ఫిర్యాదు



తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రనాయుడు హోంమంత్రి వంగలపూడి అనితను కోరారు. తిరుమలలో ఆదివారం ఉదయం ఆమెను కలిసి విన్నతి పత్రాన్ని అందజేశారు. ధర్మారెడ్డి కోరుకున్న వ్యక్తులను స్వామిసేవలో తరింపజేసి తద్వారా వైసీపీ అధినాయకులకు, ప్రభుత్వానికి అనుకూలంగా లాబీయింగ్ చేశారనిరామచంద్రనాయుడు పేర్కొన్నారు. శ్రీవాణిట్రస్టులో అంతులేని అవినీతి జరిగిందన్నారు. వీఐపీ, సేవా టికెట్లు అర్హత లేని వ్యక్తులకు ఇవ్వడం, తనవారికి కోరుకున్నన్ని టికెట్లు ఇచ్చి వ్యక్తిగతమైన పనులు చేయించుకున్నారన్నారు. బడ్జెట్‌కు మించి ఇంజినీరింగ్ పనులకు నిధులు మంజూరు చేయడం ద్వారా కొంతమంది బోర్డు సభ్యులు కమీషన్లు దండుకున్నారన్నారు. జగన్ గెలుపునకు తిరుమలలో యాగాలు చేసిన మఠానికి అక్రమంగా నిర్మాణాలకు అనుమతి ఇచ్చి స్వామి భక్తిని నిరూపించుకున్నారన్నారు. వీటిన్నిటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అనిత హామీ ఇచ్చారు.

ముగ్గురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

రెండు వాహనాలు సహా నాలుగు దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 23: అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటరుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేలోగా పారిపోవడానికి యత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్(37), మోహనవేల్(25), శక్తివేల్(27)గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూమి ధారాదత్తం

● అడ్డగోలుగా అడంగల్‌లో మార్పులు
● ఆది ఆంధ్రవాడవాసుల ఆందోళన



భూమి యజమాన్యపు హక్కుల రికార్డు ప్రకారము (1-బి) నమూనా (ROR)

జిల్లా : తిరుపతి గ్రామము : తిరుమండ్యం
మండలము : వడమాలపేట విస్తీర్ణము యూనిట్సు : ఎ.గుం./ఎ.సెం.

వరుస నం.	పట్టాదారు పేరు	(తండ్రి/భర్త పేరు)	ఖాతా నంబరు	సర్వే నంబరు మరియు సబ్-డివిజన్	భూమి వివరణ	మొత్తం విస్తీర్ణము	పట్టాదారుకు ఏ విధముగా సంక్రమించింది/ సాగుచేసారు
1	2	3	4	5	6	7	8
1	పెద్దపీరయ్య కుమారులు చెంగయ్య	-	451	195/3	పుంజ	5.1200	

వివాదంగా మారిన ప్రభుత్వ భూమి - చెంగయ్య పేరు మీద మార్చిన వన్ బీ

వడమాలపేట, జూన్ 23: వడమాలపేట మండలం తిరుమణ్యం రెవెన్యూ పరిధిలోని రూ.2 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఓ వ్యక్తి పేరుపై అడంగల్‌లో డిజిటల్ సంతకంతో మార్పు చేయడం వివాదంగా మారింది. తిరుమణ్యం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 195-3లో 5.12 ఎకరాల భూమిని 1975లో సాంఘిక సంక్షేమ శాఖ నిరుపేదల ఇళ్ల కోసం కొనుగోలు చేసింది. ఇందులో ఎనమలపాలెం ఆది ఆంధ్రవాడవాసులకు 3.22 ఎకరాలకు పైగా పట్టాలు ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నారు. సుమారుగా 20 సెంట్ల స్థలాన్ని పాఠశాలకు ప్రభుత్వం కేటాయించింది. ఇదిలా ఉండగా స్థానికుడైన పెద్ద పీరయ్య కుమారుడు చెంగయ్య సదరు భూమి తమదేనంటూ ఉన్నతాధికారులతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా పిటిషనర్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. నెల క్రితం వరకూ సంబంధిత స్థలానికి సంబంధించి అడంగల్‌లో తహసీల్దారు డిజిటల్ సైన్ లేదని నమోదై ఉండేది. అయితే తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఎలాంటి ఆధారాలు లేకనే ఏకపక్షంగా 5.12 ఎకరాల భూమి చెంగయ్య పేరుమీద అడంగల్‌లో మార్పు చేశారు.

ఇందులో ఖాళీగా ఉన్న 1.15 ఎకరాల భూమికి చెంగయ్య వారసులమంటూ అక్రమార్కులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తాగు కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న భూమిని ఓ వ్యక్తి పేరు మీదుగా 1బి, అడంగల్‌లో నమోదు చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకుని 1బి అడంగల్‌లో మార్పు చేయాలని ఎనమలపాలెం ఆదిఆంధ్రవాడ వాసులు కోరుతున్నారు.

12 మంది ఎస్టీ గురుకుల విద్యార్థులకు అస్వస్థత

● మరో ముగ్గురికి పాఠశాలలోనే చికిత్సలు
● కలుషిత తాగునీటి కారణంగానే!



విద్యార్థులకు అందుతున్న చికిత్సలపై అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

గూడూరు, జూన్ 23: మండలంలోని చెన్నూరులో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం వెళ్లగా పాఠశాలలో ఉన్న ఆర్వో మినరల్ ప్లాంటు పని చేయలేదు. దీంతో మున్సిపల్ కొళాయి నీటిని కొంత మంది విద్యార్థులు తాగారు. శనివారం సాయంత్రం ఆరుగురు విద్యార్థులకు విరేచనాలు, వాంతులు కావడంతో ప్రిన్సిపాల్, వార్డెన్లు వారిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గురుకుల పాఠశాలలో చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం మరో ఆరుగురిని నెల్లూరుకు తరలించారు.ఈ క్రమంలో మరో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు లోను కావడంతో వారికి పాఠశాలలోనే వైద్యసిబ్బంది వైద్య సేవలందించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచనల మేరకు టీడీపీ నాయకులు ఎ.శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్ చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య-పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మేన్ మృతి



హేమంత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 23: రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మేన్ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... సూళ్లూరుపేట సమీపంలోని అక్కంపేటకు చెందిన హేమంత్‌కుమార్(24) శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెంలో జూనియర్ లైన్‌మేన్‌గా పని చేస్తుండేవాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద నివాసం ఉంటున్న అతను భార్య దివ్యతో కలిసి ఆదివారం సాయంత్రం పట్టణంలోని బజారుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు.రైల్వేస్టేషన్ సమీపంలో వెళ్తుండగా తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొనింది. ఈ ప్రమాదంలో హేమంత్‌కుమార్ తీవ్రంగా, దివ్య స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే హేమంత్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

అబలాగ్రహం...

కాగుతున్న వంటనూనెను భర్తపై పోసిన భార్య



ఉదయయకుమార్

సూళ్లూరుపేట, జూన్ 23: భర్తపై కోపంతో పొయ్యిపై కాగుతున్న నూనెను పోసింది. పోలీసుల సమాచారం మేరకు... ఆబాక పంచాయతీ అమ్మలపాడుకు చెందిన కె. ఉదయకుమార్ తడ మం డలం వాటంబేడుకు చెందిన మస్తానమ్మను 9 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. బేల్దారీ పనులకు వెళ్లే ఉదయకుమార్ ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మద్యం తాగి బిర్యానీ పార్శిల్ తీసుకొని ఇంటికి వచ్చాడు. మద్యం తాగి ఇంటికి రావద్దని చెప్పినా ఎందుకొచ్చావని మస్తానమ్మ భర్తతో వాగ్వాదానికి దిగింది. అంతేకాకుండా ఆగ్రహంతో పొయ్యిపై కాగుతున్న నూనెను భర్తపై పోసేసింది. దీంతో ఉదయకుమార్‌కు ముఖం, మెడపై బొబ్బలు లేచాయి. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఉదయకుమార్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

గూడూరు, జూన్ 23:మండలానికి చెందిన ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ యువకులను పోక్సోయాక్ట్ కింద అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహాభారత మహోత్సవాలు ప్రారంభం

పాకాల, జూన్ 23: దామలచెరువు పోలిశెట్టిగారిపల్లె భారతంమిట్టలో ఆదివారం రాత్రి గణపతి పూజతో మహాభారత ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలుత పుణ్యాహవచన, కలశస్థాపన హోమం నిర్వహించారు. సోమవారం ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి జూలై 11వరకు మహాభారత హరికథా గానం జరుగుతుంది. ఈనెల 30 నుంచి నాటకాలు నిర్వహించనున్నారు. హరికథా భాగవతారిణి ఎస్.ఉషారాణి హరికథా గానం, వెంకటేశ్వర నాటక కళామండలి ఆధ్వర్యంలో రాత్రి నాటకాలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నేతల నివాళి



చంద్రగిరి, జూన్ 23: స్థానిక బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జనసంఘ్ వ్యవస్థాన అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మండల బీజేపీ నాయకులు నిర్వహించారు. చిత్తూరు జిల్లా పార్టీ ఇన్‌చార్జ్ రాటకొండ విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్రమణ్యం యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు మునిగంగిరెడ్డి, మండల నాయకులు దొరస్వామి, నరేష్ కుమార్‌నాయుడు, రామ్మూర్తి, సునీల్‌కుమార్ యాదవ్, వెంకట్రామయ్య, శేఖర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

భీమానది కట్టపై గుర్తు తెలియని వ్యక్తి శవం



చంద్రగిరి, జూన్ 23: కందులవారిపల్లె సమీపంలో భీమానది కట్టపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి శవాన్ని గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం మృతునికి 25 నుంచి 30 సంవత్సరాల వయసుంటుంది. అతని కుడి చేతిపై ధనమ్మ పేరు తెలుగులో పచ్చ బొట్టు ఉంది. బ్లూ కలర్ షర్టు, లైట్ బ్లూ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. ఇతర ఆధారాలేవీ లభించలేదు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. అనుమానస్పద మృతి కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరిలో నేటి గ్రీవెన్స్ డేకు ఎమ్మెల్యే నాని హాజరు

చంద్రగిరి, జూన్ 23: చంద్రగిరిలో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మీకోసం, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని దీనికి హాజరు కానున్నారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారు.

ఆర్‌సీపురంలో మోస్తరు వర్షం

రామచంద్రాపురం, జూన్ 23: మండలంలో ఆదివారం సాయంత్రం పలు దఫాలుగా వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు మోస్తరు వర్షం పడింది. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ ఆగిపోయారు. వరికోతలు పూర్తయిన పొలాల్లో పశుగ్రాసం తడిసి ముద్దయింది. ఉదయం నుంచి మబ్బులు కమ్మడంతో వాతావరణం చల్లబడింది. రెండు రోజులుగా తీవ్ర ఎండలతో అల్లాడుతున్న జనం కొంత ఉపశమనం పొందారు. వర్షంతో కోతకు వచ్చిన మామిడికాయల్లో పురుగుపడి నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 23: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త విజయభారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గురుకుల పాఠశాలలో సీటు కావాలో ఆ పాఠశాలలో దరఖాస్తు అందజేసి 27వ తేదీ ఉదయం 10గంటలకు ఆ గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష రాయాలన్నారు.

1.120 కిలోల గంజాయి స్వాధీనం

- ఇద్దరు విక్రేతల అరెస్టు -

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ జయనాయక్ కథనం మేరకు...ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో పుంగనూరు మండలం మిట్టపెద్ద తాండాలో కాపురమున్న బి.చంద్రశేఖరనాయక్, మదనపల్లెకు చెందిన వృద్ధురాలు ఆప ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సైకిల్‌పై విక్రయించడానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానంతో వారిని పిలిచి తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసారు. విచారించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

● ఎస్పీ హర్షవర్ధన రాజు



పోలీసు సిబ్బంది ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం)/తిరుచానూరు, జూన్ 23: చట్టానికి లోబడి పని చేసే పోలీసులకు వ్యవస్థలో ఎక్కడైనా సముచిత స్థానం ఉంటుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు అన్నారు. ఆదివారం చంద్రగిరి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ ఆత్మీయ సమావేశాన్ని స్థానిక సీఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో అత్యంత సమస్యాత్మక ప్రాంతమైనా అక్కడ ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు కష్టపడి పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఘటనలు జరగలేదన్నారు. రానున్న రోజుల్లో చట్టానికి లోబడి పనిచేసి సబ్ డివిజన్‌పై వున్న మరకను తొలగించాలని కోరారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ గుడ్ సర్వీసు ఎంట్రీ అనే రివార్డులను ప్రకటించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పద్మావతి, వేమన వర్సిటీల మధ్య ఎంవోయూ



ఒప్పంద పత్రాలతో పద్మావతి వర్సిటీ వీసీ భారతి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 23: పద్మావతి మహిళా యూనివర్సిటీ, కడపలోని యోగి వేమన యూనివర్సిటీల మధ్య ఆదివారం అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఇందుకు సంబంధించిన పత్రాలపై పద్మావతి వర్సిటీ వీసీ భారతి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు యూనివర్సిటీల మధ్య సాంకేతికంగా సరస్పరం సహకరించుకోనున్నట్లు ఆమె తెలిపారు. రిజిస్ట్రార్ రజని, వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

కాట్రపల్లెలో ప్రబలిన అతిసార

27మందికి ఆస్పత్రిలో చికిత్స



→ శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పొందుతున్న కాట్రపల్లి గ్రామస్తులు

కేవీబీపురం, జూన్ 23: మండలంలోని కాట్రపల్లె దళితవాడలో అతిసార ప్రబలి సుమారు 27మంది శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత మూడు రోజులుగా ఒకరిద్దరితో మొదలైన అతిసార ఆదివారం నాటికి 27మందికి సోకినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి కుమార్‌ను వివరణ కోరగా పారిశుధ్య లోపంతో పాటు మూడు రోజుల క్రితం గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో తీసుకున్న ఆహారం కూడా కారణం అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందం సేవలు అందిస్తోందని, ప్రస్తుతానికి అతిసార అదుపులోనే ఉందని తెలిపారు.

బీజేపీ నేతకు పలువురి పరామర్శ



ప్రభాకర నాయుడును పరామర్శిస్తున్న టీడీపీ, బీజేపీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: హోం మంత్రి వంగలపూడి అనిత తిరుమల వెళుతున్న సమయంలో శనివారం సాయంత్రం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద జిల్లా ఉత్తర మండల బీజేపీ నాయకుడు ప్రభాకర నాయుడును కాన్వాయ్‌లోని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతడి ఎడమకాలుకు బలమైన గాయమై కొంత భాగం విరిగినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని శ్రీసాయిసుధా ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుకుమార్, డాక్టర్ సుధారాణి పర్యవేక్షణలో వైద్య బృందం వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం కాలుకు ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్ సుకుమార్ చెప్పారు. ఆదివారం ప్రభాకర నాయుడును మంత్రి వంగలపూడి అనిత పరామర్శిస్తారని భావించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆఖరి నిమిషంలో కార్యక్రమం రద్దు అయినట్లు పోలీసు అధికారులు చెప్పారు. చికిత్స పొందుతున్న ప్రభాకర నాయుడును టీడీపీ నాయకులు దంపూరు భాస్కరయాదవ్, ఆర్సీ మునికృష్ణ, మస్తాన్ నాయుడు, మన్నెం శ్రీనివాసులు, లోకేష్ నాయుడు, తిరుపతి టీడీపీ అధ్యక్షుడు చినబాబు, బీజేపీ నాయకులు డాక్టర్ శ్రీహరి, గుండాల గోపీనాథ్, జెల్లి మధుసూదన్, చంద్రశేఖర్ తదితరులు పరామర్శించారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూన్ 23: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లోని పలు ప్రాంతాలను ఆదివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు వినీత్ సింగ్ తనిఖీ చేశారు. అనంతరం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను, జరిగిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. చిత్తూరు రైల్వే స్టేషన్‌లోని యార్డును, సిగ్నల్ వ్యవస్థను పరిశీలించారు. రేణిగుంట-కాట్పాడి వరకు రైలు మార్గాన్ని విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

హోం మంత్రికి సన్మానం



తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: తిరుమలకు విచ్చేసిన హోం మంత్రి వంగలపూడి అనితను ఆదివారం తిరుపతి పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి గుత్తా శరత్ చౌదరి కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం తెలుగు యువత తరపున తిరుపతిలో గంజాయి నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత నాయకులు దినేష్, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి : యూటీఎఫ్



మాట్లాడుతున్న ఎస్ఎస్ నాయుడు

తిరుపతి(విద్య), జూన్ 23: ప్రాథమిక విద్యకు ప్రతిబంధకంగా మారిన 117 జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా సహాధ్యక్షుడు కేఎస్‌బీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ... పెద్ద మొత్తంలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. మెగా డీఎస్సీలో ఉపాధ్యాయుల నియామకం పూర్తయ్యేలోపు అవసరమైనచోట విద్యావలంటీర్లను ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షులు కె.శేఖర్ మాట్లాడుతూ... 12వ పీఆర్సీని ఏర్పాటుచేసి కొత్త పీఆర్సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కోశాధికారి రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, పద్మజ, సురేష్, మోహన్‌బాబు, వెంకటకృష్ణ, విజయ్‌కుమార్, సుధీర్, హరిబాబు, గీతమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూలో బోధనేతర ఉద్యోగుల బదిలీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 23: ఎస్వీయూనివర్సిటీలో పలువురు బోధనేతర ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ● ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ సూపరింటెండెంట్ ఎన్.సుబ్రమణ్యంను పరీక్షల విభాగానికి చెందిన ఈడీపీ సెల్‌కు బదిలీ చేశారు. ● వీసీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కె.ప్రభాకరరెడ్డి ఫైనాన్స్ అండ్ అకౌంట్స్‌కు బదిలీ అయ్యారు. ● వీసీ చాంబర్‌లో టైం స్కేల్ ఉద్యోగి టి.భాస్కరరెడ్డిని ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయానికి పంపారు. ● వీసీ కార్యాలయంలోని టైంస్కేల్ ఉద్యోగి వి.భాస్కరరెడ్డిని ఫిలాసఫీ విభాగానికి బదిలీ చేశారు. ● వీసీ కార్యాలయ ఎన్ఎంఆర్ ఉద్యోగి ఒకరిని ఓఆర్ఐ విభాగానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్య ఆదివారం అధికారిక ఉత్తర్వులు వెలువరించారు.

9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులు వద్దు

తిరుపతి(విద్య), జూన్ 23: 9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని సర్వశిక్ష అభియాన్ ఆదేశాలు జారీ చేసిందని, దీనిని ఏబీవీఎస్‌వో వ్యతిరేకిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి అనంతరం మాత్రమే విద్యార్థి ఆసక్తి మేరకు జనరల్ అకడమిక్ లేదా ఒకేషనల్, టెక్నికల్ విద్యకు మళ్లించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని పరిశీలించి సర్వశిక్ష అభియాన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

నేడు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

తిరుపతి, జూన్23 (ఆంధ్రజ్యోతి): మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరగనుంది. అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని, తమ సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: మద్యం మత్తులో ఒక యువకుడిపై మందుబాబులు దాడికి దిగి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం తిరుపతి డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో చోటు చేసుకుంది. సీఐ మహేశ్వరరెడ్డి కథనం మేరకు... ఆటోడ్రైవరు ఫక్రుద్దీన్ మరికొందరు కలసి డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని కల్యాణ మండపం వద్ద మద్యం సేవించారు. ఈ నేపథ్యంలో పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని సయ్యద్ హయత్, షేక్ సలాంలు మరొకరితో కలిసి ఫక్రుద్దీన్‌పై కత్తితో దాడికి దిగి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అతడి తల, పొట్టపై బలమైన రక్తగాయాలయ్యాయి. విషయం తెలిసిన అతడి స్నేహితులు వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మంత్రి పార్థసారథికి సత్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 23: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథిని తిరుపతికి చెందిన టీడీపీ నాయకులు సత్కరించారు. ఆదివారం విజయవాడలోని మంత్రి నివాసంలో టీడీపీ నాయకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, ఓబీసీ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నున్నా భూషణ్ తదితరులు శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, శ్రీవారి ప్రసాదాలు అందించి సత్కరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు

తిరుమల, జూన్23 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. శనివారం 74,467 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 40,005 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో ఆండవన్ మఠాధిపతి



శ్రీవారి ఆలయంలో వరాహ మహాదేశికన్ స్వామి

తిరుమల, జూన్ 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగంలోని ఆండవన్ ఆశ్రమం మఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులతో కలిసి జేఈవో వీరబ్రహ్మం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. శిష్యబృందంతో ఆలయంలోకి వెళ్లిన వరాహ మహాదేశికన్ ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

'జనశక్తి ట్రేడ్ యూనియన్' అడ్‌హాక్ కమిటీ ఎంపిక

తిరుపతి(ఆటోనగర్), జూన్ 23: జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ అడ్‌హాక్ కమిటీ ఎంపిక జరిగింది. ఆదివారం తిరుచానూరులోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడిగా అలహరి సుధాకర్, అధ్యక్షుడిగా టి.అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వి.వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, ఏఎస్ రాజు, ప్రభురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ రావు, సహాయ కార్యదర్శులుగా పి.సురేష్, దొరైరాజ్, మల్లికార్జున, శివయ్య, శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సుధాకర్ ప్రకటించారు.

నగరంలో జోరు వాన









తిరుపతి అర్బన్, జూన్ 23: తిరునగరిలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. పగలంతా ఎండతీవ్రత ఉన్నా మధ్యాహ్నం నుంచి నింగిలో మేఘాలు కమ్ముకున్నాయి. సాయంత్రం వర్షం పడింది. దీంతో రోడ్లపై సంచరిస్తున్న ప్రజలు, వాహనదారులు తడిసిముద్దయ్యారు. వ్యాపారాలకు ఆటంకం కలిగింది. మురుగుకాల్వలు పొంగి పొర్లి రోడ్లపై ప్రవహించాయి. ప్రధాన కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు, అండర్‌బ్రిడ్జిలు జలమయమయ్యాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పగలంతా ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం నుంచి చల్లగా ఆహ్లాదకరంగా మారిపోవడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ఆరణి



ఆరణి దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూన్ 23: ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే దంపతులకు సన్మానం, అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ రెండేళ్ల పాటు ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. జనసేన గెలుపు కోసం ఆర్యవైశ్యులు తమ వంతు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతినెలలో తొలి మంగళవారం శ్రీవారి దర్శన టికెట్ల జారీని పునరుద్ధరించాలని, మరికొన్ని సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ తిరుపతి ఎమ్మెల్యేగా తొలిసారిగా ఆర్యవైశ్యుల నుంచే సత్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పించడంలో కృషి చేసినవారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్రకుమార్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ద్వారక, వికాస్, మాధవరావు, వంశీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డాక్టర్ సుధారాణి



తిరుపతి, జూన్23 (ఆంధ్రజ్యోతి): ప్రమాణ స్వీకారం చేసి తిరుపతి వచ్చిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఆదివారం ఆయన నివాసంలో శ్రీసాయిసుధ మల్టీస్పెషాలిటీ అధినేత్రి డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు. ఆమెతో పాటు చెంగమ నాయుడు కూడా ఉన్నారు.



హోం మంత్రి వంగలపూడి అనితకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ శాసనసభ్యురాలు సుగుణమ్మ, తిరుపతి తెలుగు మహిళా అధ్యక్షురాలు బ్యాంకు శాంతమ్మ

టీటీడీ ఈవోకు ఏపీఎన్జీవోస్ నేతల అభినందనలు



తిరుపతి(వైద్యం), జూన్ 23: ఏపీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం నాయుడుతో కలిసి తిరుపతి జిల్లా నేతలు ఆదివారం టీటీడీ ఈవో శ్యామలరావును కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. తిరుపతిలో పనిచేసే స్థానిక ప్రభుత్వ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఏడాదిలో ఒక్కసారైనా శ్రీవారి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించాలని ఆయన్ను ఏపీఎన్జీవోస్ నేతలు కోరారు. ఏపీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్, కార్యదర్శి బాలాజీ, మెడికల్ అండ్ హెల్త్ మినిస్టర్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చల్లా మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 23: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

స్వర్గధామం అభివృద్ధికి నగదు వితరణ

నాయుడుపేట, జూన్ 23: పట్టణంలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన హిందూ శ్మశానవాటిక (స్వర్గధామం) అభివృద్ధికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి రూ.50వేలను ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. దయాకర్‌రెడ్డి సోదరుడు సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం స్వర్గధామం అభివృద్ధికి నగదు అందించారు.

బాలికపై అత్యాచారం

గూడూరు, జూన్ 23: మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలానికి చెందిన ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ యువకులను పోక్సోయాక్ట్ కింద అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో కొనసాగిన వార్షిక శిక్షణ తరగతులు

కోట, జూన్ 23: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ తరగతులు జరిగాయి. ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండెంట్ గణేష్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, నివారణ చర్యలు, ఆరోగ్యం, పరిశుభ్రత, మోడలింగ్‌పై అవగాహన కల్పించారు. పలు జిల్లాల నుంచి 639 మంది క్యాడెట్లు హాజరైనట్లు ఆఫీసర్లు మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్ర బాబు తెలిపారు. అగ్నిమాపక అధికారి హరీష్, కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులొద్దు

తిరుపతి(విద్య), జూన్ 23: 9వ తరగతి నుంచే ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టాలని సర్వశిక్ష అభియాన్ ఆదేశాలు జారీ చేసిందని, దీనిని ఏబీవీపీ వ్యతిరేకిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి అనంతరం మాత్రమే విద్యార్థి ఆసక్తి మేరకు జనరల్ అకడమిక్ లేదా ఒకేషనల్, టెక్నికల్ విద్యకు మళ్లించాలని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని పరిశీలించి సర్వశిక్ష అభియాన్ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

పద్మావతి, వేమన వర్సిటీల మధ్య అవగాహన

సాంకేతిక రంగంలో పరస్పర సహకారం



ఒప్పంద పత్రాలతో పద్మావతి వర్సిటీ వీసీ భారతి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 23: పద్మావతి మహిళా యూనివర్సిటీ, కడపలోని యోగి వేమన యూనివర్సిటీల మధ్య ఆదివారం అవగాహనా ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన పత్రాలపై పద్మావతి వర్సిటీ వీసీ భారతి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఇరు యూనివర్సిటీల మధ్య సాంకేతికంగా పరస్పరం సహకరించుకోనున్నట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలి: యూటీఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ నాయుడు

తిరుపతి(విద్య), జూన్ 23: ప్రాథమిక విద్యా వ్యవస్థకు ప్రతిబంధకంగా మారిన 117 జీవోను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా సహాధ్యక్షుడు కేఎస్‌బీ సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ... పెద్ద మొత్తంలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండో ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. మెగా డీఎస్సీలో ఉపాధ్యాయుల నియామకం పూర్తయ్యేలోపు అవసరమైనచోట విద్యావాలంటీర్లను ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షులు కె.శేఖర్ మాట్లాడుతూ... 12వ పీఆర్సీని గత ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటికీ అమలు కాలేదని, వెంటనే కమిషన్ ఏర్పాటుచేసి కొత్త పీఆర్సీని ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కోశాధికారి రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్, పద్మజ, సురేష్, మోహన్‌బాబు, వెంకటకృష్ణ, విజయ్‌కుమార్, సుధీర్, హరిబాబు, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

● ఎస్పీ హర్షవర్ధన్ రాజు


పోలీసు సిబ్బంది ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం)/తిరుచానూరు, జూన్ 23: చట్టానికి లోబడి పని చేసే పోలీసులకు వ్యవస్థలో ఎక్కడైనా సముచిత స్థానం ఉంటుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. ఆదివారం చంద్రగిరి సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో ఎస్పీ ఆత్మీయ సమావేశాన్ని స్థానిక సీఎస్ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో అత్యంత సమస్యాత్మక ప్రాంతమైనా అక్కడ ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు కష్టపడి పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. కౌంటింగ్ రోజు ఎలాంటి ఘటనలు జరగలేదన్నారు. రానున్న రోజుల్లో చట్టానికి లోబడి పనిచేసి సబ్ డివిజన్‌పై వున్న మరకను తొలగించాలని కోరారు. అనంతరం జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ గుడ్ సర్వీసు ఎంట్రీ అనే రివార్డులను ప్రకటించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతమ్మ సేవలో ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, జూన్ 23: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో కొలువైన రేణుకా పరమేశ్వరి మాతమ్మ కొలుపు ఆదివారం నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం విచ్చేసి మాతమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆయనను సర్పంచు దొరబాబునాయుడు శాలువాలు కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో రామాంజులనాయుడు, జయరామిరెడ్డి, మునస్వామి యాదవ్, వెంకటకృష్ణయ్య, సురేష్, వరలక్ష్మి యాదవ్, మునికృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత దినకర్‌కు ఎమ్మెల్యే నివాళి



నాగలాపురం, జూన్ 23: నాగలాపురం మండల పరిధిలోని వెళ్లూరు మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నేత దినకరన్ శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం వెళ్లూరు గ్రామానికి చేరుకుని దినకర్ భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అబలాగ్రహం...

కాగుతున్న వంటనూనెను భర్తపై పోసిన భార్య


చికిత్స పొందతున్న ఉదయయకుమార్

సూళ్లూరుపేట, జూన్ 23: భర్తపై కోపంతో పొయ్యిపై కాగుతున్న నూనెను పోసింది. పోలీసుల సమాచారం మేరకు... ఆబాక పంచాయతీ అమ్మలపాడుకు చెందిన కె. ఉదయకుమార్ తడ మండలం వాటంబేడుకు చెందిన మస్తానమ్మను 9 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. బేల్దారీ పనులకు వెళ్లే ఉదయకుమార్ ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మద్యం తాగి బిర్యానీ పార్సిల్ తీసుకొని ఇంటికి వచ్చాడు. మద్యం తాగి ఇంటికి రావద్దని చెప్పినా ఎందుకొచ్చావని మస్తానమ్మ భర్తతో వాగ్వాదానికి దిగింది. అంతేకాకుండా ఆగ్రహంతో పొయ్యిపై కాగుతున్న నూనెను భర్తపై పోసేసింది. దీంతో ఉదయకుమార్‌కు ముఖం, మెడపై బొబ్బలు లేచాయి. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఉదయకుమార్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

గూడూరు అర్బన్, జూన్ 23: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి రథంపై అధిష్ఠింపజేశారు. భక్తులు గోవింద నామస్మరణాల నడుమ రథాన్ని లాగారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం జరిపారు.

12 మంది ఎస్టీ గురుకుల విద్యార్థులకు అస్వస్థత

● మరో ముగ్గురికి పాఠశాలలోనే చికిత్సలు
● కలుషిత తాగునీటి కారణంగానే!


విద్యార్థులకు అందుతున్న చికిత్సలను అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

గూడూరు, జూన్ 23: మండలంలోని చెన్నూరులో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం వెళ్లగా పాఠశాలలో ఉన్న ఆర్వో మినరల్ ప్లాంటు పని చేయలేదు. దీంతో మున్సిపల్ కొళాయి నీటిని కొంతమంది విద్యార్థులు తాగారు. శనివారం సాయంత్రం ఆరుగురు విద్యార్థులకు విరేచనాలు, వాంతులు కావడంతో ప్రిన్సిపాల్, వార్డెన్లు వారిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గురుకుల పాఠశాలలో చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం మరో ఆరుగురిని నెల్లూరుకు తరలించారు. ఈ క్రమంలో మరో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు లోను కావడంతో వారికి పాఠశాలలోనే వైద్యసిబ్బంది వైద్యసేవలందించారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు టీడీపీ నాయకులు ఎ.శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్ చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

తిరుమలకు కాలినడకన ఓజిలి టీడీపీ నేతలు



ఓజిలి, జూన్ 23: మండల టీడీపీ నాయకులు ఆదివారం తిరుమలకు కాలినడకన బయలు దేరారు. తమ పార్టీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఎమ్మెల్యే విజయం సాధించడాన్ని పురస్కరించుకుని కె.సత్య వరప్రసాద్‌రావు, పి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 25 మంది తిరుమలకు బయలు దేరారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, గున్నం సేవా ట్రస్ట్ అధినేత గున్నం మధురెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనరు జి.విజయకుమార్‌నాయుడు, మైనారిటీ నాయకులు ఎస్‌కె ఖలీల్, బి.రవీంద్రారెడ్డి, పి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో కోటమ్మ ఉత్సవాలు

కోట, జూన్ 23: కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎన్. జగన్మోహన రెడ్డి తెలిపారు. ఆదివారం కోటమ్మ ఆలయంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాలకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు జగన్మోహన రెడ్డి తెలిపారు.

టిడ్కో గృహాల్లో వసతుల మెరుగు: టీడీపీ

గూడూరు, జూన్ 23: టిడ్కో గృహాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో వసతులు మెరుగుపరుస్తున్నట్లు టీడీపీ మాజీ కౌన్సిలర్ వి. శివకుమార్ అన్నారు. ఆదివారం టిడ్కో గృహాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బోర్ల తవ్వకానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధిపనులు చేపట్టకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో ఎమ్మెల్యే పాశం సమస్యను తెలుసుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు బోర్లను తవ్వించారన్నారు. ఈ బోర్లుకు మోటర్లును ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తామన్నారు. పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించడంతోపాటు వీధిదీపాలు వెలిగేలా, వసతులు మెరుగుపడేలా చర్యలు చేపట్టామన్నారు. ఎట్టి నాగరాజు, టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో బైక్ దగ్ధం

గూడూరు, జూన్ 23: పట్టణంలోని కుమ్మరవీధిలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ద్విచక్రవాహనం దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య వివరాల మేరకు... కుమ్మరవీధికి చెందిన కిషోర్ తన బైక్‌లో ఇంటి నుంచి బయలుదేరాడు. వాహనంలోని బ్యాటరీ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. దీంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

1.120 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు విక్రేతల అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వెస్ట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 1.120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్ సీఐ జయనాయక్ కథనం మేరకు...ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ రవిమనోహరాచ్చారి పర్యవేక్షణలో పుంగనూరు మండలం మిట్టపెద్ద తాండాలో కాపురమున్న బి.చంద్రశేఖరనాయక్, మదనపల్లెకు చెందిన వృద్ధురాలు ఆప ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సైకిల్‌పై విక్రయించడానికి తీసుకెళుతున్నారు. ఆ సమయంలో సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అనుమానంతో వారిని పిలిచి తనిఖీ చేయగా.. గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో వారిద్దరిని అదుపులోకి తీసుకుని గంజాయి సీజ్ చేసారు. విచారించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

ముగ్గురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● రెండు వాహనాలు సహా దుంగల స్వాధీనం


స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు

మంగళం, జూన్ 23: అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఆదివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటరుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసులకు కనిపించారు. దీంతో వారిని చుట్టుముట్టేలోగా పారిపోవడానికి యత్నించారు. అయితే వారిలో ముగ్గురిని పట్టుకోగలిగారు. పట్టుబడ్డ వారిలో తమిళనాడు తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్(37), మోహనవేల్(25), శక్తివేల్(27)గా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్ స్టేషన్‌కు తరలించి సీఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఎస్‌వోఎస్ దినోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌వీ కుమార్

ఏర్పేడు, జూన్ 23: ఏర్పేడు మండలంలోని నాగంపల్లి పంచాయతీలో ఉన్న ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్‌లో వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్ హెర్మన్ మైనర్ జయంతిని పురస్కరించుకుని ఎస్‌వోఎస్ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐసర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, డైరెక్టర్, వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ ఆర్‌వీ కుమార్ పాల్గొన్నారు. తల్లులు, పిల్లలు, ఉద్యోగులతో పాటు ఎస్‌వోఎస్ తిరుపతి డైరెక్టర్ పరేష్ అతిథులకు స్వాగతం పలికారు. అసాధారణమైన పిల్లలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, ప్రొఫెసర్ ఆర్‌వీ కుమార్, వసంత్ మాట్లాడుతూ ఎస్‌వోఎస్ విలేజెస్ దార్శనికుడు హెర్మాన్ మైనర్ జయంతి కార్యక్రమంలో పాల్గొనం ఆనందంగా ఉందన్నారు. బలహీనమైన పిల్లలను శక్తివంతం చేయడంలో ఈ సంస్థ నిస్వార్థ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ ఇండియా సీఈవో సమంత కర్ తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రికి టీడీపీ నేత సత్కారం



పిచ్చాటూరు, జూన్ 23: రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు పద్మనాభ రాజు కుటుంబ సమేతంగా కలసి అభినందనలు తెలిపారు. తిరుమలలోని గాయత్రి అతిథి గృహంలో హోంమంత్రిని కలిసిన పద్మనాభరాజు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మధుబాల, మాజీ సర్పంచు లక్ష్మణరాజు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 23: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త విజయభారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ గురుకుల పాఠశాలలో సీటు కావాలో ఆ పాఠశాలలో దరఖాస్తు అందజేసి 27వ తేదీ ఉదయం 10గంటలకు ఆ గురుకుల పాఠశాలలో ప్రవేశపరీక్ష రాయాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు

తిరుమల, జూన్23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.77 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను శనివారం టీటీడీ లెక్కించాక ఆదివారం ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మేన్ మృతి


హేమంత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 23: రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మేన్ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నరసింహారావు కథనం మేరకు... సూళ్లూరుపేట సమీపంలోని అక్కంపేటకు చెందిన హేమంత్‌కుమార్(24) శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెంలో జూనియర్ లైన్‌మేన్‌గా పని చేస్తుండేవాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద నివాసం ఉంటున్న అతను భార్య దివ్యతో కలిసి ఆదివారం సాయంత్రం పట్టణంలోని బజారుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రైల్వేస్టేషన్ సమీపంలో వెళ్తుండగా తిరుపతి నుంచి నెల్లూరు వైపు వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొనింది. ఈ ప్రమాదంలో హేమంత్‌కుమార్ తీవ్రంగా, దివ్య స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే హేమంత్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే ఆరణి


ఆరణి దంపతులను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, జూన్ 23: ఆర్యవైశ్యులకు అన్ని విధాల అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఆదివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే దంపతులకు సన్మానం, అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు మాట్లాడుతూ రెండేళ్ల పాటు ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. జనసేన గెలుపు కోసం ఆర్యవైశ్యులు తమ వంతు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతినెలలో తొలి మంగళవారం శ్రీవారి దర్శన టికెట్ల జారీని పునరుద్ధరించాలని, మరికొన్ని సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే ఆరణి మాట్లాడుతూ తిరుపతి ఎమ్మెల్యేగా తొలిసారిగా ఆర్యవైశ్యుల నుంచే సత్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన కల్పించడంలో కృషి చేసినవారికి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్రకుమార్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ద్వారక, వికాస్, మాధవరావు, వంశీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేత ప్రభాకర నాయుడికి నేడు శస్త్రచికిత్స

పలువురి పరామర్శ


ప్రభాకర నాయుడిని పరామర్శిస్తున్న బీజేపీ, టీడీపీ నేతలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: హోం మంత్రి అనిత తిరుమల వెళుతున్న సమయంలో శనివారం సాయంత్రం అలిపిరి గరుడ సర్కిల్ వద్ద జిల్లా ఉత్తర మండల బీజేపీ నాయకుడు ప్రభాకర నాయుడిని కాన్వాయ్‌లోని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో అతడి ఎడమకాలు కొంత భాగం విరిగినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని శ్రీసాయిసుధా ఆర్థోపెడిక్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుకుమార్, డాక్టర్ సుధారాణి పర్యవేక్షణలో వైద్య బృందం వైద్య సేవలు అందిస్తున్నారు. సోమవారం కాలుకు ఆపరేషన్ నిర్వహిస్తామని డాక్టర్ సుకుమార్ చెప్పారు. ఆదివారం ప్రభాకర నాయుడును మంత్రి వంగలపూడి అనిత పరామర్శిస్తారని భావించి అన్ని ఏర్పాట్లు చేశారు. ఆఖరి నిమిషంలో కార్యక్రమం రద్దు అయినట్లు పోలీసు అధికారులు చెప్పారు. చికిత్స పొందుతున్న ప్రభాకర నాయుడును టీడీపీ నాయకులు దంపూరు భాస్కరయాదవ్, ఆర్సీ మునికృష్ణ, మస్తాన్ నాయుడు, మన్నెం శ్రీనివాసులు, లోకేష్ నాయుడు, తిరుపతి టీడీపీ అధ్యక్షుడు చినబాబు, బీజేపీ నాయకులు డాక్టర్ శ్రీహరి, గుండాల గోపీనాథ్, జెల్లి మధుసూదన్, చంద్రశేఖర్ తదితరులు పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

గౌడ సంక్షేమ సంఘ కార్యవర్గం



శ్రీకాళహస్తి, జూన్ 23: గౌడ సంక్షేమ సంఘ నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నికున్నారు. చైర్మన్‌గా అంతటి రమేష్‌బాబు గౌడ్, అధ్యక్షుడుగా తిరుకాల ఆనంద్‌గౌడ్, కార్యదర్శిగా కోసూరు వెంకటరమణ గౌడ్, కార్యనిర్వాహకుడుగా అప్పరాల గణేష్‌గౌడ్‌తో పాటు మరో 11 సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌడ సంక్షేమ సంఘ లీగల్ అడ్వైజర్ ఉదయగిరి మోహన్‌గౌడ్, అత్తిరాల శ్రీరాములు గౌడ్, బత్తెయ్యగౌడ్, జడపల్లి పాపయ్య గౌడ్, జడపల్లి మునిశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో జోరు వాన



తిరుపతి అర్బన్, జూన్ 23: తిరునగరిలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. పగలంతా ఎండతీవ్రత ఉన్నా మధ్యాహ్నం నుంచి నింగిలో మేఘాలు కమ్ముకున్నాయి. సాయంత్రం వర్షం పడింది. దీంతో రోడ్లపై సంచరిస్తున్న ప్రజలు, వాహనదారులు తడిసిముద్దయ్యారు. వ్యాపారాలకు ఆటంకం కలిగింది. మురుగుకాల్వలు పొంగి పొర్లి రోడ్లపై ప్రవహించాయి. ప్రధాన కూడళ్లు, లోతట్టు ప్రాంతాలు, అండర్‌బ్రిడ్జిలు జలమయమయ్యాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పగలంతా ఉక్కపోతగా ఉన్న వాతావరణం సాయంత్రం నుంచి చల్లగా ఆహ్లాదకరంగా మారిపోవడంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేశారు.

రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూన్ 23: రేణిగుంట-కాట్పాడి రైల్వే సెక్షన్‌లోని పలు ప్రాంతాలను ఆదివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు వినీత్ సింగ్ తనిఖీ చేశారు. అనంతరం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను, జరిగిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. చిత్తూరు రైల్వే స్టేషన్‌లోని యార్డును, సిగ్నల్ వ్యవస్థను పరిశీలించారు. రేణిగుంట-కాట్పాడి వరకు రైలు మార్గాన్ని విండో ఇన్స్‌పెక్షన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ


ముక్కంటి ఆలయం వద్ద భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 23: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,550మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,663మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,789మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,305, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 363మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 327మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 83 మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 21,924 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

హోంమంత్రికి ముక్కంటి ప్రసాదాలు


హోంమంత్రి వంగలపూడి అనితను సన్మానిస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, జూన్ 23: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితకు టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ముక్కంటి ప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. ఆదివారం హోంమంత్రి రోడ్డు మార్గంలో శ్రీకాళహస్తి మీదుగా నెల్లూరుకు వెళ్లారు. పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వద్ద టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, టీడీపీ శ్రేణులు హోం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటి ఆలయ శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం

శ్రీకాళహస్తి, జూన్ 23: శ్రీకాళహస్తి పట్టణంలోని 26వ వార్డులో సుమారు పది ఇళ్లకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పురపాలక సంఘ అధికారులను మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఆదివారం టీడీపీ నాయకులు అద్దంకి కిట్టు, యశ్వంత్ ఆధ్వర్యంలో పైపులైను మరమ్మతులు చేపట్టారు. నూతన కుళాయిని ఏర్పాటు చేశారు. స్థానికులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పలుమార్లు అర్జీలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన 24గంటల్లో మరమ్మతులు చేయించడం సంతోషకరమన్నారు. స్థానికులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

శ్రీకాళహస్తి, జూన్ 23: పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఆదివారం జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, కండ్రిగ ఉమ, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, జి.వి.అమర్‌నాథ్, రమణ, రమణారెడ్డి, పగడాల ప్రతాప్, మోహన్‌రావు, డిల్లీకుమార్, వాసుయాదవ్, గోపాల్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు ప్యాలెస్ పిచ్చి: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఉమేష్‌రావు

శ్రీకాళహస్తి, జూన్ 23: మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ప్యాలెస్ పిచ్చి అని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గతంలో తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఊరూరా వేల ఎకరాలు కాజేసి వాటిలో విశాలమైన రాజప్రసాదాలను తలదన్నే రీతిలో ప్యాలెస్‌లను జగన్ నిర్మించుకున్నారని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ తన సొంత రాజకీయ పార్టీ కార్యాలయాలకు కేవలం రూ.వెయ్యి నామమాత్రపు ధరకు 33 సంవత్సరాలు లీజుకు కేటాయించుకోవడం అక్రమమన్నారు. వీటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయడానికి హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కమిషన్ వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజాయాదవ్, భీమాల భాస్కర్, మణి, శివ, గణేష్, వంశీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఎన్నిక

ఏర్పేడు, జూన్ 23: ఏర్పేడు అంబేడ్కర్ యువజన సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పిల్లపాళెం వాసుదేవులు, ఉపాధ్యక్షుడు మెరుం శంకరయ్య, ప్రధాన కార్యదర్శి మెరుం చంద్రశేఖర్, కోశాధికారి చీకోలు నారాయణను ఎన్నుకున్నారు. అదే విధంగా అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీని కూడా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఏర్పేడు జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య, సభ్యులుగా కిరణ్‌కుమార్, జయరామ్, కలపాటి గురవమ్మ, మెరుం శంకరయక్య, గాలి రవి, పిల్లపాళెం వాసుదేవులు, ఈశ్వర్‌ను ఎన్నుకున్నారు. అంబేడ్కర్ భవన్ అడ్వైజర్ కమిటీ చైర్మన్‌గా మెరుం అంకయ్య, సభ్యులుగా ఈశ్వరయ్య, డాక్టర్ మునెయ్య, హరి, బాలకృష్ణ, తోకల రవిచంద్ర, శ్రీధర్, గోపి, రామచంద్రయ్య, ప్రభను ఎన్నుకున్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

రేణిగుంట, జూన్ 23: మండలంలోని ఆర్.మల్లవరం ప్రభుత్వ పాఠశాల పాఠశాల విద్యార్థులకు ఉయ్ ఫర్ ఓల్డ్ అండ్ చిల్డ్రన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నవీన్, నూతన్, సురేష్, చంద్ర, వినోద్, హేమాద్రి పాల్గొన్నారు.

సచివాలయంపై పేరు తొలగింపు

శ్రీకాళహస్తి, జూన్ 23: శ్రీకాళహస్తి మండలంలోని పోలి గ్రామ సచివాలయంపై ఉన్న ప్రైవేటు వ్యక్తి పేరును గుర్తు తెలయని వ్యక్తులు ఆదివారం తొలగించారు. పోలి గ్రామంలోని సచివాలయ భవనంపై ప్రైవేటు వ్యక్తి పేరును పొందుపరచడంపై చాలాకాలంగా అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈక్రమంలో గుర్తు తెలయని వ్యక్తులు సచివాలయంపై ఉన్న ప్రైవేటు వ్యక్తి పేరును తొలగించారు.

కాట్రపల్లెలో ప్రబలిన అతిసార

27మందికి ఆస్పత్రిలో చికిత్స


శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పొందుతున్న కాట్రపల్లి గ్రామస్తులు

కేవీబీపురం, జూన్ 23: మండలంలోని కాట్రపల్లె దళితవాడలో అతిసార ప్రబలి సుమారు 27మంది శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గత మూడు రోజులుగా ఒకరిద్దరితో మొదలైన అతిసార ఆదివారం నాటికి 27మందికి సోకినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి కుమార్‌ను వివరణ కోరగా పారిశుధ్య లోపంతో పాటు మూడు రోజుల క్రితం గ్రామంలో జరిగిన ఓ ఫంక్షన్‌లో తీసుకున్న ఆహారం కూడా కారణం అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రత్యేక వైద్య బృందం సేవలు అందిస్తోందని, ప్రస్తుతానికి అతిసార అదుపులోనే ఉందని తెలిపారు.

అలంకార ప్రాయంగా ఏటీఎంలు

- నగదు కోసం ఇబ్బందులు పడుతున్న జనం



మూడు నెలలు నుంచి మూసివున్న ఎస్‌బీఐ ఏటీఎం

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 23: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల ఏటీఎంలు అలంకార ప్రాయంగా మారాయి. ఎస్‌బీఐ ఏటీఎం మూడు నెలలు నుంచి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఏటీఎం గత ఆరు మాసాలుగా పనిచేయడం లేదు. మండల ప్రజలు శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వరదయ్యపాళెం ప్రాంతాలకు వెళ్లి అక్కడి ఏటీఎంల నుంచి నగదు తెచ్చుకుంటున్నారు. మండల పరిధిలోని శ్రీసిటీ, అపాచీ ఇతర పరిశ్రమల్లో పెద్దసంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. ఏటీఎంలు పనిచేయకపోవడంతో వారంతా నగదు డ్రా చేసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఏటీఎంలు పని చేయడంలేదని పలుమార్లు బ్యాంకు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత బ్యాంకుల అధికారులు స్పందించి ఏటీఎంలు పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీకాళహస్తిలో జోరు వాన


నగరివీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

శ్రీకాళహస్తి, జూన్ 23: శ్రీకాళహస్తిలో ఆదివారం జోరువాన కురిసింది. సాయంత్రం 6.30గంటల సమయంలో హోరుగాలితో వర్షం ప్రారంభమైంది. 8 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు వీధులు జలమయం అయ్యాయి. నగరివీధిలో మురుగుకాలువలు పొంగిపొర్లి రోడ్డుపై నీరు ప్రవహించింది.

చంద్రగిరిని అభివృద్ధి పథంలో నడిపిస్తా: పులివర్తి నాని


అభిమానులతో కరచాలనం చేస్తున్న పులివర్తి నాని

రేణిగుంట, జూన్ 23: చంద్రగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆదివారం ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత మొదటి సారిగా సొంత నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యకర్తలు, అభిమానులు విమానాశ్రయానికి చేరుకుని స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తల కృషి, చంద్రబాబు నాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఆశీస్సులతో తాను ఎన్నికల్లో గెలుపొందానని తెలిపారు. అనంతరం భారీఎత్తున ర్యాలీగా చంద్రగిరికి బయలుదేరి వెళ్లారు.

ఆలయ నిర్మాణం తొలగింపుపై అభ్యంతరం

శ్రీకాళహస్తి, జూన్ 23: నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని తొలగించడంపై కుందేటివారి వీధి ఎస్టీకాలనీ వాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి పట్టణం కుందేటివారి వీధిలోని ఎస్టీకాలనీలో గతంలో టీడీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించింది. అవి శిథిలావస్థకు చేరుకోవడంతో అదే ప్రాంతంలో 2018లో మళ్లీ గత టీడీపీ ప్రభుత్వం నూతన పక్కా గృహాలను నిర్మించి ఇచ్చింది. కాగా, కాలనీలో గంగమ్మ ఆలయాన్ని నిర్మించుకోవడానికి స్థానికులు కొద్దిరోజుల క్రితం పనులు ప్రారంభించారు. కాలనీకి అనుకుని ఉన్న ఓ వ్యక్తి స్థలంలోకి ఆలయ నిర్మాణం రెండు అడుగుల మేర చొరబడినట్లు వివాదం రేగింది. అధికారులు రెండు రోజుల క్రితం సర్వే చేసి రెండు అడుగుల మేర ప్రైవేటు స్థలంలోకి ఆలయ నిర్మాణం జరుగుతున్నట్లు తేల్చారు. ఆదివారం ప్రైవేటు స్థలం యజమాని తన జాగాలోని రెండు అడుగుల నిర్మాణాన్ని కాకుండా మొత్తం పెకలించేశారు. దీనిపై కుందేటివారి వీధి ఎస్టీ కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై తేజోమయుడు


సూర్యప్రభ వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు - చంద్రప్రభ వాహనంపై తేజోమయుడు

వడమాలపేట, జూన్ 23: అప్పలాయగుంటలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా ఆదివారం ప్రసన్న వెంకటేశ్వరుడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై మాడవీధుల్లో విహరించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేపట్టారు. ఉదయం చంద్రప్రభ వాహనంపై శ్రీనివాసుడు భద్రి నారాయుడి అలంకారంతో తేజోమయుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరునికి స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం సర్వాభరణాలు, సర్వాలంకార భూషితుడైన శ్రీహరికి భక్తుల గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు చంద్రప్రభ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగుతూ అభయహస్తంతో భక్తులను కటాక్షించారు. భక్తులు నారికేల, కర్పూర నీరజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు శ్రీవారి రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం 9.25 - 11.00 గంటల మధ్య ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరుడి రథోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

అలరిస్తున్న నృత్య ప్రదర్శనలు

అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్యాలు భక్తులను అలరిస్తున్నాయి. వైకుంఠ నాధుని కీర్తిస్తూ చిన్నారులు ప్రదర్శిస్తున్న నృత్యాలు భక్తుల్లో దైవభక్తిని ప్రజ్వలింప జేస్తున్నాయి.

ప్రభుత్వ భూమి ధారాదత్తం

- అడ్డగోలుగా అడంగల్‌లో మార్పులు
- ఆది ఆంధ్రవాడవాసుల ఆందోళన




ఫారం -1 బీ
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము, రెవెన్యూ శాఖ, భూమి రికార్డుల కంప్యూటరీకరణ
Certified By
Verified by RAJASIMHA NARENDRA VELPULA
Designation: TAHSILDAR
Print Home Download Certificate

వివాదంగా మారిన ప్రభుత్వ భూమి - చెంగయ్య పేరు మీద మార్చిన వన్ బీ

వడమాలపేట, జూన్ 23: వడమాలపేట మండలం తిరుమణ్యం రెవెన్యూ పరిధిలోని రూ.2 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు ఓ వ్యక్తి పేరుపై అడంగల్‌లో డిజిటల్ సంతకంతో మార్పు చేయడం వివాదంగా మారింది. తిరుమణ్యం రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 195-3లో 5.12 ఎకరాల భూమిని 1975లో సాంఘిక సంక్షేమ శాఖ నిరుపేదల ఇళ్ల కోసం కొనుగోలు చేసింది. ఇందులో ఎనమలపాలెం ఆది ఆంధ్రవాడవాసులకు 3.22 ఎకరాలకు పైగా పట్టాలు ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నారు. సుమారుగా 20 సెంట్ల స్థలాన్ని పాఠశాలకు ప్రభుత్వం కేటాయించింది. ఇదిలా ఉండగా స్థానికుడైన పెద్ద పీరయ్య కుమారుడు చెంగయ్య సదరు భూమి తమదేనంటూ ఉన్నతాధికారులతో పాటు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా పిటిషనర్‌కు వ్యతిరేకంగా తీర్పు వచ్చింది. నెల క్రితం వరకూ సంబంధింత స్థలానికి సంబంధించి అడంగల్‌లో తహసీల్దారు డిజిటల్ సైన్ లేదని నమోదై ఉండేది. అయితే తహసీల్దార్ రాజసింహ నరేంద్ర ఎలాంటి ఆధారాలు లేకనే ఏకపక్షంగా 5.12 ఎకరాల భూమి చెంగయ్య పేరుమీద అడంగల్‌లో మార్పు చేశారు. ఇందులో ఖాళీగా ఉన్న 1.15 ఎకరాల భూమికి చెంగయ్య వారసులమంటూ అక్రమార్కులు మ్యుటేషన్‌కు దరఖాస్తు చేస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. తాగు కొన్నేళ్లుగా నివాసం ఉంటున్న భూమిని ఓ వ్యక్తి పేరు మీదుగా 1బి, అడంగల్‌లో నమోదు చేయడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. కలెక్టర్ స్పందించి తహసీల్దార్‌పై చర్యలు తీసుకుని 1బి అడంగల్‌లో మార్పు చేయాలని ఎనమలపాలెం ఆదిఆంధ్రవాడ వాసులు కోరుతున్నారు.

పుత్తూరు వార్తలు

పాము కాటుతో మహిళ మృతి

పుత్తూరు అర్బన్, జూన్ 22: పాము కాటుతో మహిళ మృతి చెందిన సంఘటన పుత్తూరు మండలంలో జరిగింది. కుటుంబసభ్యుల కథనం మేరకు... ఎగువ తిరుమలకుప్పం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మమ్మ(65) శనివారం సాయంత్రం గ్రామంలోని కృష్ణుడి ఆలయంలో చెత్తను తొలగిస్తుండగా పాము కాటేసింది. కుటుంబ సభ్యులు ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది.

పోలీస్ స్టేషన్‌కు చేరిన జాతర పంచాయితీ

పుత్తూరు అర్బన్, జూన్ 23: మండల పరిధిలోని నేసనూరులో జాతర పంచాయితీ ఆదివారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. గ్రామంలో గంగజాతర నిర్వహణపై ఇరువర్గాల నడుమ పేచీ వచ్చింది. దీంతో జాతర ఎవరు నిర్వహించాలనే విషయంపై గ్రామం రెండు వర్గాలుగా విడిపోయింది. ఎంతకీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గంగజాతర విషయంలో గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి


శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూన్ 22: జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మురళీ, నాయకులు మునస్వామి, మధు, ప్రకాష్, సుధాకర్, మోహన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్దేశ్వరస్వామి జాతర

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 23: మండల కేంద్రంలోని సిద్దేశ్వరస్వామి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు సిద్దేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు, పూజలు చేసి పొంగళ్లు పెట్టారు. మహిళలు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించండి


ధనుంజయ యాదవ్

విజయపురం, జూన్ 23: గ్రామ పంచాయతీ నిధుల దారి మళ్లింపుపై విచారించి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనుంజయయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయపురంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. నాలుగు సంవత్సరాల నుంచి రాష్ట్రంలోని 12,918 పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14, 15 ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.8,629కోట్లను కేటాయిస్తే గత ప్రభుత్వం దారి మళ్లించి దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. దీనిపై పలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సరస్వతి మాతా సేవా సమాజం వార్షికోత్సవం


వార్షికోత్సవంలో జిల్లా విద్యాశాఖాధికారులు

పుత్తూరు, జూన్ 23: పుత్తూరులోని సరస్వతి మాతా సాంఘిక సేవా సమాజం వార్షికోత్సవం స్థానిక ప్రభుత్వ మెయిన్ పాఠశాలలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ మాట్లాడుతూ పుత్తూరు, నారాయణవనం, వడమాలపేట, కార్వేటినగరం, నగరి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 400 మంది పేద విద్యార్థులకు పుస్తకాలు, పరికరాలను అందించడం సంతోషకరమన్నారు. మండల స్థాయిలో పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు పొందిన విద్యార్థులకు నగదు, అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పుత్తూరు డీవైఈవో ప్రభాకరరాజు, ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, సంఘ నిర్వాహకులు ప్రసాద్, రవిశంకర్, బాలసుబ్రహ్మణ్యం, యుగంధర్‌రాజు, కుమారవేలు పాల్గొన్నారు.